క్లుప్తంగా

దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళం



ఆలయ అధికారికి చెక్కు అందజేస్తున్న దాత సత్యవాణి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం నిమిత్తం ఒక భక్తురాలు విరాళాన్ని అందించారు. ఆదివారం దేవస్థానానికి విచ్చేసిన ఏలూరు గాంధీనగర్‌కు చెందిన అముజూరి సత్యవాణి ఆలయ అధికారులను కలిశారు. ప్రతి రోజూ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానం కోసం రూ.1,00,000 చెక్‌ను వారికి విరాళంగా అందజేశారు. దాత సత్యవాణికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితుల వేదాశీర్వచనం, అధికారులు అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

ఆహారపు అలవాట్ల మార్పుతో వ్యాధులకు చెక్



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజలు క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను మంచి ఆహారపు అలవాట్లతో, అవగాహనతో నియంత్రణలో ఉంచుకోవచ్చునని విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ సూచించారు. జీబీఆర్ ఫౌండేషన్, ఏలూరు దుర్గా తేజ లయన్స్ క్లబ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శివన్నారాయణ నేతృత్వంలో స్థానిక అగ్రహారంలోని గాంధీ మహా విద్యాలయంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, మూర్ఛ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి, రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బయటి ఆహారానికి బదులుగా ఇంట్లో చేసిన ఆరోగ్యకరమైన ఆహారం భుజించి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సందర్శించిన లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ వీకే పంకజాక్షన్ మాట్లాడుతూ డాక్టర్ శివన్నారాయణ సమాజానికి అందిస్తున్న వైద్య సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోమలి,లయన్స్ క్లబ్ చీఫ్ ఎడిటర్ వి.వెంకటస్వామి, వెలగా శ్రీనివాస్, గీతా పంకజ్, వెలగపూడి విష్ణు కుమార్ సేవలందించారు. ఈ వైద్య శిబిరంలో 510 మందికి వైద్య సేవలు అందించారు.

ఉత్సాహంగా బాలోత్సవం



ఆక్స్‌ఫర్డ్స్ స్కూల్లో బాలోత్సవంలో పాల్గొన్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శాంతినగర్‌లోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్స్ ప్రధాన క్యాంపస్‌లో శనివారం బాలోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఎంఆర్ హాస్పిటల్స్ ఛైర్మన్ మాత్రాజు, సుగర్ వ్యాధి నిపుణుడు కల్యాణ చక్రవర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఆక్స్‌ఫర్డ్ ఆంగ్ల పాఠశాలల ఛైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి, స్కూల్ ఆర్‌ఐ టి.ఉమారాణి, ప్రిన్సిపాళ్లు ఐవీ సుధాకర్, శారద, ఒలింపియాడ్ ప్రిన్సిపాల్ లత పలు అంశాలు వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

మద్యం మత్తు.. యువత భవిత చిత్తు

- లక్ష్యం స్వర్ణాంధ్రప్రదేశ్.. చేసింది మద్యాంధ్రప్రదేశ్
- విచ్చలవిడిగా, వేళాపాళా లేకుండా మద్యం విక్రయాలు
- పట్టపగలే మద్యం సేవించి వీధుల్లో మందుబాబుల హల్‌చల్
- మత్తులో జోగుతూ పెడదోవ పడుతున్న యువత



పట్టపగలు ఆరు బయట మద్యం తాగుతున్న యువకులు



అమీనా పేట కాజ్‌వే సమీపంలో మద్యం మత్తులో రోడ్డు పక్కనే నిద్రిస్తున్న యువకుడు



మద్యం మత్తులో ఓ ఇంటి ముందు స్పృహ లేకుండా నిద్రపోతున్న వ్యక్తి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యం స్వర్ణాంధ్రప్రదేశ్ అని చెబుతున్నా చేతల్లో మాత్రం మద్యాంధ్రప్రదేశ్ చేసారని ఏలూరు నగర ప్రజలు ఆవేదన చెందుతున్నారు. విచ్చలవిడిగా మద్యం షాపులు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంతో పాటు వాటికి సంబంధించి నిర్దిష్ట సమయాలు, నిర్వహణపై అధికారుల నిఘా లేకపోవడంతో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. దీంతో మందు బాబులు పగలు పూటుగా మందు తాగి ఎటు వెళ్లాలో తెలియని మైకంలో ఇళ్ల ముందు, షాపుల ముందు, రోడ్లపైనా, ఖాళీ ప్రదేశాలు, పార్కుల్లో ఎక్కడి పడితే అక్కడ పడి దొర్లుతున్నారు. దీంతో ఆయా కుటుంబాలకు చెందిన వారు ఆవేదన, ఆక్రందన చెందుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పదుల సంఖ్యలో మందు షాపులు, వీటికి తోడు అనధికారంగా నిర్వహించే బెల్టు షాపుల కారణంగా నిత్యం యువత వేళాపాళా లేకుండా మద్యం మత్తులో జోగుతున్నారు. దీంతో యువత పెద్ద సంఖ్యలో పెడదోవ పడుతున్నారంటూ నగర వాసులు ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వంలో మద్య విక్రయాలపై నియంత్రణ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం షాపులను నేరుగా ప్రభుత్వమే నిర్వహించేంది. దీనికి తోడు ఉదయం 11 నుంచి సాయంత్రం 9 గంటల వరకే మద్యం విక్రయించేవారు. ఒక్క నిమిషం ముందుగాని, ఆలస్యంగా గాని షాపుల్లో మద్యం విక్రయాలు జరగకుండా స్కానర్లు పనిచేసేవి కాదు. దీనికి తోడు ఎక్కడా బెల్టు షాపులు లేకుండా పూర్తిగా కట్టడి చేశారు. దీంతో తప్పనిసరిగా ప్రభుత్వ మద్యం షాపునకు వచ్చి నిర్దేశించిన సమయంలో మాత్రమే మద్యం కొనుగోలు చేసేవారు. దీంతో నడి రోడ్డు మీద మందు తాగేవారు, పూటుగా తాగి రోడ్డుపైనే పడి దొర్లేవారు కనిపించే వారు కాదు. దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మద్యం విక్రయాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో సీను రివర్స్ అయ్యింది. పేదలు తాగే చీఫ్ లిక్కర్‌ను కొంత మేర ధర తగ్గించడంతో రోజువారీ పనులు చేసుకునే వారు, ముఖ్యంగా యువత వేళాపాళా లేకుండా మద్యం తాగుతూ పగలూ, రాత్రి అనే తేడా లేకుండా మత్తులో జోగుతూ రోడ్లపై పడి దొర్లుతున్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్ట్ షాపులు

బెల్టు షాపులు నిర్వహిస్తే జరిమానాలు విధిస్తాం, కేసులు నమోదు చేస్తామంటూ ప్రభుత్వ పెద్దలు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కూటమి నాయకుల అండదండలతో వీధుల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా దర్శనమిస్తున్నాయి. కనీసం వీటి వైపు కన్నెత్తి చూసేందుకు సైతం ఎక్సైజ్ శాఖ అధికారులు భయపడుతున్నారు. ఎవరైనా అమాయకులు దొరికితే వారిని అదుపులోకి తీసుకుని కేసులు కట్టి వేధిస్తున్నారనే విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి. విచ్చలవిడిగా మద్యం షాపులు వాటికి అనుబంధంగా బెల్టు షాపులు నిర్వహించడంపై మహిళా సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెడదోవ పడుతున్న యువత

జోరుగా మద్యం విక్రయాల కారణంగా నగరంలోని యువత పెద్ద ఎత్తున మద్యానికి బానిసై పోతున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో ఒక్కోసారి డబ్బుల కోసం అసాంఘిక కార్యక్రమాలకు సైతం యువత వెనుకాడటం లేదని మహిళా సంఘాల నాయకులు చెబుతున్నారు. గతంలో రోడ్డుకు 200 మీటర్ల దూరంగా మద్యం షాపును నిర్వహించే వారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఎటువంటి నిబంధనలు విధించకపోవడంతో గుడి, బడి అనే తేడా లేకుండా ప్రధాన రోడ్లకు ఆనుకుని మద్యం షాపులు ఏర్పాటు చేసారు. దీంతో ఒక్కో సమయంలో రోడ్ల వెంబడి వెళ్లే వాహనదారులు, ప్రజలు ముఖ్యంగా మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పెడదోవ పడుతున్న యువతను సరైన మార్గంలో మళ్లించాల్సిన పాలకులే దానికి భిన్నంగా పనిచేయడం అత్యంత బాధాకరమని ఏలూరు నగర వ్యాప్తంగా పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బెల్టు షాపులను అరికట్టాలి



ఏలూరు నగరంలో విచ్చల విడిగా నిర్వహిస్తున్న బెల్టుషాపులను పూర్తిగా అరికట్టాలి. గతంలో మచ్చుకైనా కన్పించని బెల్టు షాపులు నేడు ప్రతి పేటలో, సందులో దర్శనమిస్తున్నాయి. అధికార పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులే బెల్టు షాపులకు ఊతమిచ్చే విధంగా సహకరిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. ఇటీవల అసాంఘిక కార్యకలాపాలు పెరిగి పోవడానికి మద్యం విచ్చలవిడి అమ్మకాలే కారణమవుతున్నాయి.

– ఏ.రాణి, ఐద్వా జిల్లా కార్యదర్శి, ఏలూరు

విచ్చలవిడి మద్యం విక్రయాలను నిరోధించాలి



విచ్చలవిడిగా మద్యం విక్రయాలను ప్రభుత్వం నిరోధించాలి. ఎప్పుడు పడితే అప్పుడు మద్యం విక్రయించకుండా చర్యలు చేపట్టాలి. నిర్దిష్ట సమయంలో మాత్రమే విక్రయించేలా చూడాలి. ప్రధాన కూడళ్లల్లో మద్యం షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులు తిరిగే ప్రాంతాల్లో మద్యం విక్రయాలను నియంత్రించాలి.

– ఎం.అరుణకుమారి, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు, ఏలూరు

ఆందోళనలు చేసినా పట్టించుకోవడం లేదు



ఏలూరు నగరం పరిధిలో మద్యం షాపుల ఏర్పాటు, బెల్టు షాపుల నిర్వహణకు వ్యతిరేకంగా ఎన్ని ఆందోళనలు చేపట్టినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులకు సైతం వీటికి వ్యతిరేకంగా వినతిపత్రాలు అందజేసాం. ఒక పక్క మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెరిగిపోవడానికి విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సైతం కారణమవుతున్నాయి.

– జి.శారద, మహిళా సంఘం నాయకులు, ఏలూరు

ట్రాఫిక్ సమస్య.. నిత్యం అవస్థ

- ఏలూరులో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ
- రోడ్ల ఆక్రమణలతో ప్రయాణికులకు తప్పని తిప్పలు
- రోడ్ల విస్తరణకు చర్యలు శూన్యం



ఏలూరు ఎన్‌ఆర్‌పేట కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారి వద్ద ట్రాఫిక్ ఐల్యాండ్



ఏలూరు ఎస్‌వీసీ మాల్, పార్కు రోడ్డు మధ్యలో ట్రాఫిక్ సూచికల ఏర్పాటు



సీఆర్‌ఆర్ కాలేజీ వద్ద ఇరుకుగా మారిన రోడ్డు



ఏలూరు కోర్టు సెంటర్ వద్ద ఇలా

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. నగరం విస్తరిస్తున్న తరుణంలో జనాభా పెరుగుదల, వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్ల విస్తరణ లేకపోవటంతో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. నిత్యం వేలాది మోటారు సైకిళ్లు, కార్లు రోడ్లపై పరుగులు పెడుతుంటే వాటిని క్రమబద్ధీకరించటం పోలీస్, ట్రాఫిక్ పోలీసులకు కత్తిమీద సాములా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో నగరం ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుపోతోంది. ముఖ్యంగా ఏలూరు టూటౌన్ ప్రాంతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం కావటంలేదనే చెప్పాలి.

నగరం విస్తరిస్తోంది

ఏలూరు నియోజకవర్గం గత ఐదేళ్లతో పోల్చితే విస్తరించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఏలూరు పరిసరాల్లోని 7 గ్రామ పంచాయతీలు ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. చొదిమెళ్ల, మాదేపల్లి, మరోవైపు శనివారపుపేట, సత్రంపాడు, వట్లూరు ప్రాంతాల వరకూ నగరం శరవేగంగా విస్తరిస్తోంది. నగర జనాభా సైతం 3.25 లక్షలకు చేరటంతో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఒక్కో కుటుంబంలోనే రెండు, మూడు వాహనాలు ఉంటున్నాయి. ఏలూరు నగరంలో ఆటోలు 15వేల వరకూ నిత్యం రోడ్లపై తిరుగుతూ ఉంటాయి. ఇక మోటారు సైకిళ్లకు లెక్కలేదు. కార్లు సైతం వేల సంఖ్యలో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏలూరు నియోజకవర్గం ప్రజాప్రతినిధుల, జిల్లా ఉన్నతాధికారులు రోడ్ల విస్తరణపై దృష్టి సారించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు సతమతం

ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు నిత్యం ఇబ్బది పడుతున్నారు. ఉదయం స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారితో రోడ్లు కిక్కిరిసిపోతున్నాయి. మరోవైపు సాయంత్రం 5గంటల అనంతరం స్కూళ్లు, కళాశాలలు వదిలే సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగిపోతోంది. ఏలూరు ఎన్‌ఆర్‌పేటలో కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి ఒకేసారి పదివేలకు పైగా విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు రోడ్లపైకి వస్తారు. ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచీ సీఆర్‌ఆర్ అటానమస్ కాలేజీ వరకూ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఆర్‌ఆర్‌పేట, కోర్టు సెంటర్, జూట్‌మిల్లు సెంటర్, కలెక్టరేట్ ప్రాంతం అంతా వాహనాలతో రద్దీగా మారిపోతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, సివిల్ పోలీసులంతా రోడ్లపైకి వచ్చినా గంటలపాటు రోడ్లన్నీ స్తంభించిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

రోడ్ల ఆక్రమణపై దృష్టి సారించాలి

ఏలూరు నగరంలో రోడ్ల ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించాలనే అభిప్రాయం ఉంది. ముఖ్యంగా కొత్త బస్టాండ్ సమీపంలోని జన్మభూమి పార్కు రోడ్డు, ఎస్‌వీసీ మాల్ వైపు రోడ్డు ఇరుకుగా మారింది. ఉన్న చిన్నరోడ్డులోనే బారికేడ్లు పెట్టటంతో మరింత ఇబ్బందిగా మారింది. సీఆర్‌ఆర్ అటానమస్ కాలేజీ పక్కగా మినీబైపాస్ రోడ్డుకు వెళ్లేందుకు ఉన్న చిన్న రోడ్డును ట్రాఫిక్ దృష్ట్యా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇక కోర్టు సెంటర్ ప్రాంతంలోనూ ఆటోలు, మోటారు సైకిళ్లు రోడ్లపైనే నిలుపుదల చేస్తూ ట్రాఫిక్ అంతరాయానికి కారణంగా మారుతున్నారు. ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి కోర్టు సెంటర్‌కు వెళ్ళే పూలకొట్లు తొలగించి రోడ్లు విస్తరిస్తే మంచిదనే అభిప్రాయం ఉంది. వన్‌టౌన్ ప్రాంతంలో చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ నుంచి వెళ్లే రోడ్లన్నీ నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా మారిపోతున్నాయి. ఆర్‌ఆర్‌పేటలోని ప్రధాన రహదారి, పత్తేబాద రోడ్డుపై మోటారు సైకిళ్లు, కార్లు నిలుపుదల చేస్తూ ట్రాఫిక్ సమస్యను మరింత జఠిలం చేస్తున్నారని జనం వాపోతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. ఏలూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ప్రత్యేక పర్యవేక్షణలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎన్‌ఆర్‌పేట జెడ్పీ కార్యాలయం సెంటర్ వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు కృషి చేస్తున్నాం. ప్రజలు రోడ్లపై మోటారు సైకిళ్లు, కార్లు, ఆటోలు పార్కింగ్ చేయటం ద్వారా మరింత ఇబ్బందిగా మారుతోంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవు.

– ఎస్.లక్ష్మణరావు, ఏలూరు ట్రాఫిక్ సీఐ

నూతన కార్యవర్గం ఎన్నిక



పాఠశాల విద్య సర్వీస్ అసోసియేషన్ జిల్లా కమిటీకి ఎన్నికైన ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాల విద్య సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఎన్నికలు ఆదివారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర పాఠశాల విద్య సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా వి.క్రాంతి కిరణ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.పవన్‌కుమార్, జనరల్ సెక్రటరీగా పి.కుమార స్వామి, ట్రెజరర్‌గా ఎం వంశీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఐ. సుధాకర్, మహిళా సెక్రటరీగా ఎల్. ఝాన్సీ రాణి వైస్ ప్రెసిడెంట్స్‌గా ఐదుగురు, సెక్రటరీలుగా ఐదుగురిని నూతనంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకురాలుగా కె.రాజకుమారి, ఎన్నికల అధికారిగా టి. శ్రీనివాస్, వ్యవహరించగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రెసిడెంట్ పద్మ కుమారి, స్టేట్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, గౌరవ అతిథులుగా ఏ. సామ్యూల్, కేఎస్ఆర్ మోహన్ పాల్గొన్నారు.

రైతులకు హమాలీ చార్జీలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ధాన్యం రైతులకు హమాలీ చార్జీలు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో రూ.3 కోట్లకు పైగా హమాలీ చార్జీలు చెల్లించాల్సి ఉందన్నారు. ధాన్యం సొమ్ములు 48 గంటల్లో చెల్లిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం హమాలీ చార్జీలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. హమాలీ, రవాణా చార్జీలు రైతులకు సక్రమంగా అందించడం లేదని అన్నారు. 80 శాతానికి పైగా ధాన్యం ఉత్పత్తి చేస్తున్న కౌలు రైతులపైనే హమాలీ, రవాణా చార్జీలు భారం పడుతోందని చెప్పారు. ఈ క్రాప్‌లో భూ యజమాని పేరు ఉండటం వల్ల వారి పేరుతో ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రవాణా, హమాలీ చార్జీలు భూ యజమానుల బ్యాంక్ అకౌంట్లలో ఆలస్యంగా జమ చేయడం వల్ల కౌలు రైతులకు చేరడం లేదన్నారు. ఇప్పటికైనా బకాయిగా ఉన్న హమాలీ చార్జీలు వెంటనే రైతులకు ఖాతాలకు జమ చేయాలని కోరారు.

డాక్టర్ జగన్మోహనరావు మృతి



డాక్టర్ జగన్మోహన రావు (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో సేవా భావంతో వైద్య వృత్తి నిర్వహించి ప్రజల మనస్సుల్లో మంచి స్థానం పొందిన డాక్టర్ యార్లగడ్డ జగన్మోహన రావు (85) కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. లయ నిజంలో ఆయన అంతర్జాతీయ గుడ్ విల్ ఆఫ్ అంబాసిడర్ అవార్డు పొంది, హేలాపురి లయన్స్ క్లబ్ ద్వారా 48 ఏళ్లగా ఏలూరు ప్రజలకే కాక లయ నిజం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖపట్నంలో లయన్స్ క్యాన్సర్ హాస్పిటల్ ఏర్పాటులో, విజయవాడలో లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటులో, దెందులూరులో లయన్స్ ఐటీఐ, ఏలూరులో కేపీహెచ్ఎల్ డిగ్రీ కళాశాల నిర్మాణంలో జగన్మోహనరావు విశేషంగా కృషి చేశారు. డాక్టర్ జగన్మోహనరావు మృతికి హేలాపురి లయన్స్ క్లబ్ సభ్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, మానవత సంస్థ సభ్యులు, అభినయ నృత్యభారతి సభ్యులు, రోటరీ క్లబ్ సభ్యులు, వివిధ రంగాల ప్రముఖులు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	68
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	60
కాకర కాయలు	28-36	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	64	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-55	గోంగూర	07
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాలి

పెదవేగి : దేశవ్యాప్తంగా న్యాయవాదులంతా భారత రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాలని ఆర్సియం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ఉద్బోధించారు. ఆదివారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాల్లోని సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాలలో కథోలిక న్యాయవాదుల ముగింపు సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ న్యాయవాదులంతా నిబద్ధత కలిగి ఉండాలని శాంతి, న్యాయం కోసం అహర్నిశలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. న్యాయవాదులు రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకొని దేశవ్యాప్తంగా సదస్సులు సమావేశాలు ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని ఇనుమడింప చేయాలన్నారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా హాజరైన 130 మంది న్యాయవాదులు, సిస్టర్లు, జడ్జిలు సుపీరియర్లకు పీఆర్వో ఫాదర్ టి ఇమ్మానుయేల్ నిర్వహణ బృందం ఫాదర్లు ఫాదర్ జి మోజెస్, ఫాదర్ బాల, ఫాదర్ ఇన్నే పాల్, ఫాదర్ జాకబ్, ఫాదర్ బాబు జార్జి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ సమితి సభ్యురాలిగా యామిని నియామకం

ఏలూరు (టూటౌన్): భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జాతీయ సమితి సభ్యురాలిగా ఏలూరుకు చెందిన ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీకేఎంయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వర రావు తదితరులు ఆదివారం ఆమెకు అభినందనలు తెలిపారు. ఈనెల 6 7 8 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ 22వ జాతీయ మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభల చివర రోజు ఆదివారం నిర్వహించిన జాతీయ సమితి ఎన్నికల్లో జాతీయ సమితి సభ్యులుగా ఏలూరుకు చెందిన యామిని ఎన్నిక కావడం అభినందనీయమని అన్నారు.

బాల్య వివాహాలు అనాగరికం

ఉంగుటూరు: బాల్య వివాహాలు అనాగరికమైన విధానమని, వాటిని అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని కమిటీ సభ్యులు అల్లు శ్రీను అన్నారు. ఆదివారం ఉప్పాకపాడులో బాల్యవివాహాల వల్ల సమాజానికి, వ్యక్తిగత ఆరోగ్యానికి కలిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో అల్లు శ్రీను మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వల్ల మహిళల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. బాలబాలికలను చదివించడం తల్లిదండ్రుల బాధ్యతగా గుర్తించాలన్నారు.బాల్య వివాహాలను అరికడతామని తల్లిదండ్రులు, బాలబాలికలతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు నక్క సుధాకర్, ఏఎన్ఎం ప్రశాంతి, అంగన్‌వాడీ టీచర్లు సుబ్బలక్ష్మి, జాన్సీ, ఆశావర్కర్లు నిర్మలా, మణి తల్లిదండ్రులు పాల్గొన్నారు.